క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం చైత్ర మాసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా అమ్మవారి తీర్థాలు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం, ఊలపల్లి గ్రామాల్లో అమ్మవారి తీర్థాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం చైత్ర మాసం పౌర్ణమిని పురస్కరించుకుని కొమరిపాలెం కనకదుర్గమ్మ అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఊలపల్లిలో సోమాలమ్మ తల్లి తీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఇద్దరు అధ్యాపకులకు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న ప్రిన్సిపాల్ రాజాశ్రీరావు, సూరిబాబు

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలోని ఇద్దరు అధ్యాపకులకు భారత్ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులు వరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజా శ్రీరావు భీష్మాచార్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సూరిబాబు జ్యేష్ఠాచార్య అవార్డులను అందుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఏఐసీటీఈ (న్యూఢిల్లీ) చీఫ్ కోఆర్డినేటర్ బుద్ధ చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. విద్యారంగంలో విశేష సేవలందించే అధ్యాపకులకు బ్రైనో విజన్ సంస్థ ఏటా ఈ అవార్డులు అందజేస్తోంది.

వైద్య విభాగం జిల్లా కార్యదర్శిగా భాస్కర్



సూరిశెట్టి భాస్కర్

మధురపూడి: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా కార్యదర్శిగా నియోజకవర్గంలోని శ్రీరంగపట్నానికి చెందిన సూరిశెట్టి భాస్కర్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన పార్టీ అనుబంధ కమిటీల నియామకంలో ఆయనకు పదవి దక్కింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఈ కమిటీలను ఏర్పాటు చేశారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

సీతానగరం: మండలంలోని ములకల్లంక శివారున పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.25,250 స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరందరూ బొబ్బిల్లంకకు చెందిన వారని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

మద్యం కేసులో ఇద్దరు

రంగంపేట: మండలంలోని మర్రిపూడి, రంగాపురం గ్రామాల్లో సారా, మద్యం అమ్మకాలపై దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తుల్ని అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు మంగళవారం తెలిపారు. మర్రిపూడి గ్రామంలో మట్టా శ్రీను వద్ద నుంచి 30 లీటర్ల సారా, రంగాపురంలో పి.అరవాలు వద్ద నుంచి మూడు మద్యం సీసాలు, ఏడు బీర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. శ్రీను, అరవాలుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

యువకుడి మృతి



సతీష్ మృతదేహం

సీతానగరం: మండలంలోని రాపాక సమీపంలో కల్వర్టులో పడి యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. రఘుదేవపురంలో జరుగుతున్న చింతాలమ్మ సిరికి కోరుకొండ వడ్డీలపేటకు చెందిన ధార సతీష్ (26), కె.శేఖర్, ధార సురేష్ కుమార్ మోటారు సైకిల్‌పై బయలుదేరారు. రాపాక మీదుగా రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డులో నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్దకు చేరుకున్నారు. డైవర్షన్ రోడ్డు నుంచి వెళ్లాల్సి ఉండగా అది గమనించకుండా పాతరోడ్డు మీదుగా వెళ్లడంతో ప్రమాదవశాత్తూ కల్వర్టు మధ్యలో పడ్డారు. ఈ ఘటనలో సతీష్‌కు తీవ్ర గాయాలు, సురేష్ కుమార్, శేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వస్తున్న ఎస్సై టి.రామకృష్ణ వెంటనే సతీష్‌ను సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్ద గల ప్రైవేటు ఆస్పత్రికి కారులో తీసుకువెళ్లారు. అప్పటికే సతీష్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

పేదల జీవితాల్లో వెలుగులు



గాడాలలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- జగన్ పాలనలో అందరి సంక్షేమం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: జగనన్న పాలనలోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని, ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధం లాంటిదని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాడాల, మధురపూడి, నిడిగట్ల గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడిన జగన్ ఒంటరిగా పోరాడుతున్నారని, ఆయనకు అండగా మనమంతా నిలవాలని కోరారు. అమ్మ ఒడి, రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి, రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. 21,178 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలిచ్చినట్టు పేర్కొన్నారు. స్థానిక పొన్నాలమ్మ వారిని దర్శించుకున్న అనంతరం ప్రారంభ మైన ప్రచారయాత్ర గాడాలలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. ప్రతి కూడలిలో ఆయన స్థానికులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం నిడిగట్ల, మధురపూడి గ్రామాల్లో జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసియ్య, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు జగన్ కృషి

- పారదర్శకంగా పథకాల అమలు
- వంగలపూడిలో డాక్టర్ రాజశ్రీ ఎన్నికల ప్రచారం



వంగలపూడిలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న డాక్టర్ రాజశ్రీ

సీతానగరం: మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందించారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. మండలంలోని వంగలపూడి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఓట్లను అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాలను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, సంక్షేమం, అభివృద్ధి సమానంగా జరిగిందన్నారు. రాజానగరం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎంతో కృషి చేశారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, పార్టీ నాయకులు కొంచ భాస్కరరావు, రంధి సుధాకర్, రంధి భారతీదేవి, కొంచ బాబూరావు, తిర్నాతి చిన్నా, మద్దంశెట్టి గాంధీ, ముత్యం శ్రీనివాస్, నల్లనాగ రాజారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



పాత తుంగపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సుకీర్తి

రాజానగరం: ప్రజాసంక్షేమమే పరమావధిగా ఐదేళ్ల పాటు సుభిక్ష పరిపాలనను అందించిన జగనన్న సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ఉమ్మడి గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సతీమణి సుకీర్తి అన్నారు. మండలంలోని పాత తుంగపాడులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని, ప్రభుత్వ పరంగా అందుకున్న సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. వచ్చే ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, సంక్షేమ పాలనను తిరిగి తెచ్చుకోవాలని కోరారు. ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాలను గెలిపించాలని కోరారు.

కొండగుంటూరులో..

మండలంలోని కొండగుంటూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు నక్కా రాజబాబు మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, ప్రతి ఒక్కరినీ కలుసుకుని ఈ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరాన్ని, ఆవశ్యకతను వివరించారు. గడచిన ఐదేళ్లలో స్థానికంగా జరిగిన అభివృద్ధిని, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ ఇవన్నీ కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

జగనన్న పాలనలోనే పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రంగంపేటలో ఇంటింటా ఎన్నికల ప్రచారం



రంగంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వ పాలనలోనే పేదల అభ్యున్నతి జరిగిందని, ఇకపై కూడా జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తమ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలజల్లులు, మంగళ హారతులతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దేవిగుడి సెంటర్‌లోని కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ జరగని విధంగా ఇంటింటికీ జగనన్న సంక్షేమ పథకాలు అందించారన్నారు. పేదలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ప్రతి గ్రామంలోను ఏర్పాటు చేశారన్నారు. ఒక ఇంటిలో రేషన్ కార్డు కావాలన్నా, పింఛన్, ఇంటి స్థలం వంటి అనేక సంక్షేమ పథకాలను గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో పేద ప్రజలకు చేరువ చేశారన్నారు. మళ్లీ ఇదే జగనన్న పాలనకు మనమంతా కలసికట్టుగా పనిచేద్దామని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇబ్రాయిల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు కె.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న నామినేషన్లు

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనపర్తి అసెంబ్లీ స్థానానికి నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఊపందుకుంది. మంగళవారం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ తరపున మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నామినేషన్ పత్రాలను ఆయన బంధువు తేతలి అబ్బూస్‌రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురికి అందజేశారు. అదేవిధంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున వై.శ్రీనివాసరావు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున షేక్ సర్దార్ హుస్సేన్, స్వతంత్ర అభ్యర్థిగా స్థానిక వెంకటరత్నాపురానికి చెందిన నూతిక ప్రవీణ్‌కుమార్‌లు నామినేషన్ దాఖలు చేశారు.

నేడు నామినేషన్ దాఖలు చేయనున్న ఎమ్మెల్యే

అనపర్తి అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం ఉదయం 10.39 గంటలకు స్థానిక ఆర్ఓ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఎలాంటి హంగు ఆర్భాటాలకు తావివ్వకుండా ఎన్నికల నిబంధనలను అనుసరించి పరిమిత సభ్యుల సమక్షంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

ఐదు నామినేషన్ల దాఖలు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం నలుగురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా జక్కంపూడి సత్తిబాబు, స్వతంత్ర్య అభ్యర్థిగా కుసుమే గాంధీ, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ ఒక్కో సెట్ నామినేషన్ వేయగా, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ముండ్రు వెంకట శ్రీనివాస్ రెండు సెట్లు దాఖలు చేశారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత గడచిన ఆరు రోజులలో పది మంది అభ్యర్థులు 11 సెట్ల నామినేషన్లు అందజేశారు.

250 మంది వలంటీర్ల రాజీనామా

సీతానగరం: మండలంలో 250 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో కేఆర్‌ఎస్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రఘుదేవపురం-2, 3 పరిధిలో నలుగురు మంగళవారం తమ రాజీనామా పత్రాలను అందించారన్నారు. మండలంలో 335 మంది వలంటీర్లకు గాను 250 మంది రాజీనామా చేశారని, మరో ఇద్దరిని తొలగించామన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగన్ రావాలి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- ఏపీత్రయంలో ఎన్నికల ప్రచారం



ఏపీత్రయం గ్రామంలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

పెదపూడి: రాష్ట్రంలో ఇంటింటికీ అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. మంగళవారం మంగళవారం ఆమె ఏపీత్రయం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు ప్రతి గడపలో ప్రజలు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలతో తమ కుటుంబాలు అభివృద్ధి చెంది ఆనందంగా ఉన్నామంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా తీసుకుని అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఆ పథకాలతో ఎన్నో పేద కుటుంబాలు అభివృద్ధి సాధించాయన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి రానున్న ఎన్నికల్లో అఖండ విజయాన్ని కట్టబెట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తన భర్త ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, స్థానిక సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, సర్పంచ్ అడబాల అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన, గ్రామ కన్వీనర్ పెండెం వీరబాబు, పి.కల్యాణి, మేడపాటి విజయ, వేగు రాంబాబు, కర్రి సత్యనారాయణ, అడబాల వెంకటరమణ, గుండా బాలాజీ, పెండెం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణ



బాపిరాజును వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న జక్కంపూడి గణేష్

మధురపూడి: కోరుకొండకు చెందిన బీజేపీ సీనియర్ నేత పసుపులేటి బాపిరాజు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. గణేష్ మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఆయన పాలనకు ఆకర్షితులై అనేక మంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. బాపిరాజు వంటి సీనియర్ నేతల సలహాలు, సూచనలు ఈ పార్టీ విస్తృతికి చాలా అవసరమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని అసత్యాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికలలో కూటమికి బుద్ధి చెప్పడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు.

ఉమ్మడి పార్టీలను తరిమికొడదాం



దివాన్‌చెరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆరిఫ్

రాజానగరం: లౌకికవాదంతో విరాజిల్లుతున్న దేశంలో మతతత్వాన్ని రెచ్చగొట్టి, సమైక్యతను విచ్ఛిన్నం చేయాలనే చూస్తున్న మతతత్వ పార్టీని, దానితో జతకట్టిన ఇతర పార్టీలను కూకటి వేళ్లతో పెకలించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ ఆరిఫ్ అన్నారు. ఇందుకోసం ముస్లింలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం దివాన్‌చెరువులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ముస్లింలు విద్య, వైద్యం, ఉద్యోగం, వ్యాపార రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముస్లింల ధార్మిక జీవనశైలిని అవమానిస్తూ, దళితుల అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్న మతతత్వ పార్టీలకు ఏపీలో స్థానం లేదన్నారు. మైనార్టీల ద్రోహి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలసి దుష్ట కూటమిని ఏర్పాటు చేసి, ముస్లింల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ రమీజ్, మసీదు అధ్యక్షుడు షేక్ ఖాజాబాబు, నాయకులు ముజాహిద్, రెహమాన్, అహ్మద్ వలీ, మౌలాలీ, బషీర్, సూఫియన్ పాల్గొన్నారు.

బాలికల చదువుతో సమాజ వికాసం



కోరుకొండ హైస్కూల్లో మాట్లాడుతున్న సీడీపీఓ ఝాన్సీరాణి

మధురపూడి: బాలికలను చదివించడం, వారికి హక్కులు కల్పించడం ద్వారానే సమాజ వికాసం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ కోరుకొండ సీడీపీవో జె.ఝాన్సీరాణి అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఝాన్సీరాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు, లింగా నిర్ధారణ, అక్రమ రవాణాను అరికట్టాలంటే ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. చదువులో రాణిస్తున్న బాలికలు ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. బాల్య వివాహాలు సమాజానికి హానికరమన్నారు. హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం జి.రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె.మోహనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిల్లంక హైస్కూల్లో..

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.ఇందిరా భారతి, అంగన్‌వాడీ టీచర్లు వి.రాధారాణి, జె.గంగాభవాని, ఎల్.సరోజ, ఎ.పద్మ, ఎం.మణి తదితరులు పాల్గొన్నారు. చినకొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో సీడీపీవో పి.వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూపర్ వైజర్ కె.పెదలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా టాపర్‌కు ఎమ్మెల్యే అభినందన



విద్యార్థిని మేఘనను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కొంకుదురులో విద్యార్థులను సత్కరించిన పూర్ణ ఫౌండేషన్ సభ్యులు



రంగంపేటలో విద్యార్థులను సత్కరించిన ఉపాధ్యాయులు

అనపర్తి: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం, రాష్ట్ర స్థాయిలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్న విద్యార్థిని కర్రి విద్యా మేఘనను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు. మండలంలోని పొలమూరుకు చెందిన మేఘన మండపేట రూరల్ మండలంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో చదువుతూ పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 597 మార్కులు సాధించింది. దీంతో మంగళవారం ఎమ్మెల్యేను కలిసిన విద్యార్థినిని ఎమ్మెల్యే అభినందిస్తూ మేఘన చదువులో మరింత ప్రతిభను కనబరిచి మరెన్నో విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు అప్పారెడ్డి, హేమలతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పొలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాలలో పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. పాఠశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కుక్కల శ్రీతేజస్విని, సప్పా వీరమనీషా, జామి అపర్ణలను గ్రామానికి చెందిన పూర్ణ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ దేవాదుల అనిల్ కుమార్, సభ్యులు సత్తి శివరామారెడ్డి, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

రంగంపేట: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ, తృతీయ స్థానం సాధించిన రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బొంతు వాసు, దెయ్యాల హారికలను ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి మంగళవారం సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డురాదన్నారు. విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్మించిన సమావేశ వేదికను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వరలక్ష్మి, సుభద్ర, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మంగళవారం ఎస్పీ పి.జగదీష్ పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సంబంధిత పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామన్నారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఎన్నికల కోడ్ ఉల్లంఘన



నరసన్న సన్నిధిలో కార్యకర్తలకు అల్పాహారం వడ్డిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధురపూడి: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. కోరుకొండలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో మంగళవారం ఆ పార్టీ శ్రేణులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఆ పార్టీ కండువాలతోనే కార్యకర్తలు అల్పాహారం తిన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి ముండ్రు వెంకట శ్రీనివాస్ కోరుకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రేణులకు నారసింహుని సన్నిధిలో అల్పాహారం వడ్డించారు. ఎన్నికల నిఘా అధికారులు సమీపంలో ఉన్నప్పటికీ పట్టించుకోలేదు. దేవాలయ అధికారులు వారించినప్పటికీ కాంగ్రెస్ నాయకులు వినలేదు. ఆలయ ఆవరణలో ప్రారంభం కాని డార్మెటరీ భవనం వద్ద ఆహారం వడ్డించడం చర్చనీయమైంది.